సాక్షి మంచిర్యాల

మంగళవారం ♦ 31 ♦ డిసెంబర్ ♦ 2024



మిశ్రమ సాగు..
మిశ్రమ పంటల సాగుతో రైతులు లాభాలు గడిస్తున్నారు. ఆయిల్‌ఫాం తోటల్లో అంతరపంటగా మొక్కజొన్న, సోయా, వేరుశనగ, పెసర, బొబ్బర్లు వంటి పంటలు సాగు చేస్తున్నారు. 8లో▸



పల్లెను తలపిస్తున్న బల్దియా
బెల్లంపల్లి మున్సిపాల్టీ అభివృద్ధికి నోచుకోవడం లేదు. పట్టణ సుందరీకరణను అధికారులు మరువడంతో రోడ్ల వెంట, జనావాసాల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
31.0 /19.0
ఆకాశం ఉదయం వేళ ప్రకాశవంతంగా.. రాత్రి వేళ మేఘావృతమై ఉంటుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గి చలి తీవ్రత పెరుగుతుంది.

వణికించిన పులి, ఏనుగు



గత ఏప్రిల్‌లో సంచరించిన ఏనుగు



మహారాష్ట్ర నుంచి వచ్చిన పులి

- తొలిసారిగా ఏనుగు దాడిలో ఇద్దరి మృతి
- పులి దాడిలో మరొకరు..
- రెండు పులుల మరణం
- ఈ ఏడాదిలోనూ వన్యప్రాణులు, మనుషులకు ఘర్షణ



కాగజ్‌నగర్ మండలం సర్కెపల్లి, దరిగాం అడవుల్లో చనిపోయిన పులి

రివైండ్ 2024

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది వన్యప్రాణులు అలజడి రేపాయి. ఏటా చలికాలంలో పులుల సంచారం ఉన్నప్పటికీ ఈ సంవత్సరం మరింత ఎక్కువగా కనిపించాయి. రెండేళ్ల తర్వాత గత నెలలో కాగజ్‌నగర్ మండలం గన్నారానికి చెందిన మోర్లే లక్ష్మిని పత్తి చేనులోనే దాడి చేసి చంపేయగా, సిర్పూర్(టీ) పరిధి దుబ్బగూడలో రైతు సురేశ్‌పై దాడి చేసింది. అయితే ఆయన ప్రాణాలతో బయటపడ్డారు. ఇక రైతుల పశువులు, మేకల మందలపైనా దాడులు చేస్తున్నాయి. దీంతో అటవీ సమీప ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలకు కునుకు లేకుండా పోతోంది. రోడ్లు దాటుతూ, జన సంచారం ఉన్న చోటు వరకు పులులు, చిరుతలు కనిపిస్తున్నాయి. గడిచిన ఏడాదిలోనూ మనుషులు, వన్యప్రాణులకు ఘర్షణ కొనసాగింది.

వలస పులులతో భయం

ఈ ఏడాది పొడవునా మహారాష్ట్ర నుంచి కవ్వాల్ టైగర్ రిజర్వులోకి పులులు రాకపోకలు సాగించాయి. ఇందులో ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల వరకు ఓ మగపులి, సిర్పూర్(టీ) మీదుగా మరో పులి, ఆసిఫాబాద్ జిల్లాలో మరో పులి సంచరించింది. వీటిలో రెండు మగవి, కాగా ఒకటి ఆడపులి ఉంది. ప్రస్తుతం రెండు వలస పులులు సంచరిస్తున్నాయి. మరోవైపు ఇద్దరిపై దాడి చేసి పులి మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దుల్లో సంచరిస్తోంది. ఆదిలాబాద్ నుంచి మొదలై జన్నారం వరకు పులులు సంచరించాయి. దీంతో ఆయా చోట్ల ఉన్న స్థానికులు బెంబేలెత్తారు.

తొలిసారిగా ఏనుగు రాక

రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా ఓ ఏనుగు ఉమ్మడి జిల్లాకు వచ్చింది. మూడు రోజులపాటు సంచరిస్తూ అలజడి రేపింది. ఇద్దరిపై దాడి చేసి చంపేసింది. గత ఏప్రిల్‌లో 25నుంచి 30ఏళ్ల వయస్సు మగ ఏనుగు చింతలమానేపల్లి మండలం బూరెపల్లిలో మిరపతోటలో రైతు శంకర్‌ను చంపేసింది. మరుసటి రోజే పెంచికల్‌పేట మండలం కొండపల్లిలో కారు పోశన్నపై దాడి చేసి చంపేసింది. దీంతో స్థానికులు చేన్లలోకి వెళ్లాలంటే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. చివరకు మురళిగూడ సమీపంలో ప్రాణహిత దాటి మహారాష్ట్ర వైపు వెళ్లిపోవడంతో స్థానికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు భవిష్యత్తులోనూ ఏనుగులు వచ్చే అవకాశం ఉన్నట్లు ముందస్తుగా చర్యలు తీసుకునేందుకు ప్రణాళికను సైతం అటవీ శాఖ సిద్ధం చేసుకుంది.

రెండు పులుల మరణం

మరోవైపు ఈ ఏడాదిలోనే రెండు పులులు మరణించాయి. ఐదారేళ్ల వయస్సున్న మగ పులి (ఎస్ 9)ని విషమిచ్చి చంపారు. గత జనవరిలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ డివిజన్ దరిగాం, సర్కెపల్లి మధ్య బూడిద మామిడి అడవుల్లో ఏడాదిన్నర ఆడపులి, అదే నెల 8న ఐదారేళ్ల మగ పులి కళేబరాలను గుర్తించారు. ఈ రెండింటిలో ఆడపులి మాత్రం మరోపులితో పోరులో చనిపోగా, మగపులి మాత్రం విషంతో చనిపోయినట్లు అధికారులు గుర్తించారు. ఈ రెండు పులల మరణంతో అటు అటవీ అధికారులపై చర్యలు తీసుకోవడంతోపాటు పలువురు రైతులపైనా కేసులు నమోదయ్యాయి. అంతేకాక మరోసారి ఎవరూ పులులకు ముప్పు కలిగించకుండా, పశువులు, మనుషులపై దాడి చేస్తే నష్టపరిహారం పెంచడంతోపాటు 24గంటల్లోనే చెల్లించేలా ఏర్పాటు చేశారు.

తాగి రోడ్లపైకి రావొద్దు..

జీవితాలు ఆగం చేసుకోవద్దు

- నేడు రాత్రి 10గంటల నుంచే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు
- ఏడు బృందాలతో పోలీసు బందోబస్తు
- ర్యాష్‌డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్‌పై నిఘా
- మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్



మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్

మంచిర్యాలక్రైం: ''ప్రతీ ఏడాది డిసెంబర్ 31 వస్తుంది.. పోతుంది. ఇదే చివరి రోజు అన్నట్లుగా అతిగా మద్యం సేవించి రోడ్లపైకి రావొద్దు. జీవితాలు ఆగం చేసుకోవద్దు. నిబంధనలు ఉల్లంఘిస్తే లాఠీలకు పని చెబుతాం...'' అని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ స్పష్టం చేశారు. వేడుకల్లో ఎలాంటి దుర్ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ఎక్కడికక్కడ ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహిస్తారని తెలిపారు. ఏడు ప్రత్యేక బృందాలు డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్‌పై దృష్టి సారిస్తాయని అన్నారు. డిసెంబర్ 31న రాత్రి ప్రజల భద్రత, పోలీసు బందోబస్తుపై 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు.

డిసెంబర్ 31న మద్యం దుకాణాలు బంద్ చేస్తే బాగుంటుందని మహిళలు కోరుతున్నారు.

డీసీపీ: మద్యం దుకాణాల బంద్ అనేది ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. అది ఎక్సైజ్ పాలసీ. ఇది కొంత ప్రజలను ఇబ్బంది పెట్టించే విధంగా ఉంటుంది. మద్యం తాగి రోడ్లపైకి వచ్చేవారిపై ప్రజల భద్రత కోసం కఠినంగా వ్యవహరిస్తాం. మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వహణకు రాత్రి 12గంటల వరకు అనుమతి ఇచ్చింది. ఆ తర్వాత తెరిచి ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

డీసీపీ: మంగళవారం రాత్రి 10గంటల నుంచి జిల్లాలోని ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలో అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు. ప్రధాన పట్టణ కేంద్రాల్లో ఐదు బృందాలు ఏర్పాటు చేసి చౌరస్తాల్లో వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తాం. మరో రెండు బృందాలతో కలిసి డీసీపీ, ఏసీపీ పర్యవేక్షిస్తుంటారు. ఎక్కడైనా మేజర్ సంఘటనలు, అల్లర్లు, గొడవలు, ప్రమాదాలు జరిగితే వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని అవసరమైన చర్యలు తీసుకుంటాం. రాత్రి 10గంటల నుంచి వేకువజామున 5గంటల వరకు పెట్రోలింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తాం. పట్టుబడిన వారిపై కేసు నమోదు, వాహనం సీజ్ చేస్తూ కుటుంబ సభ్యులకు సమాచారం అందించి అప్పగిస్తాం.

కొందరు యువకులు ద్విచక్ర వాహనాలతో ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరిస్తూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. మరికొందరు అరుస్తూ హల్‌చల్ చేస్తుంటారు. వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు.

డీసీపీ: మనిషి జీవితంలో డిసెంబర్ 31 అనేది చివరి రోజు కాదు. జనవరి1 అనేది మొదటి రోజు కాదు. ఇవి ప్రతీ సంవత్సరం వస్తుంటాయి.. పోతుంటాయి... ఇక ఈ రోజుతో అయిపోయింది.. ఇదే చివరి రోజు అనుకొని ఎంజాయ్ అనే పేరుతో జీవితాలను అంధకారం చేసుకోవద్దు. తల్లిదండ్రులు తమ పిల్లలకు అర్ధరాత్రి పూట వాహనాలు ఇవ్వొద్దు. మద్యం సేవించిన తర్వాత అస్సలు ఇవ్వద్దు. మద్యంమత్తులో ర్యాష్ డ్రైవింగ్‌తో ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంది. ఇతరులకు ఇబ్బంది కలిగించినా, అల్లర్లు చేసినా కేసులు నమోదు చేస్తాం.

వేడుకల్లో డీజే అనుమతి ఉందా..?

డీసీపీ: న్యూ ఇయర్ వేడుకల్లో ప్రత్యేకంగా డీజే వినియోగానికి అనుమతులు ఏమి లేవు. ఇప్పటి వరకు ఎవరు దరఖాస్తు చేసుకోలేదు. ఇప్పటి వరకు ఎవరికీ ఇవ్వలేదు. వివిధ స్టార్ హోటళ్లలో వేడుకల నిర్వహణకు పోలీస్ అనుమతి తీసుకోవాలి. వేడుకల్లో మద్యం, పేకాట, అశ్లీల నృత్య ప్రదర్శనలకు అనుమతులు లేవు. ఒకవేళ చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం.

రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు..

డీసీపీ: ఎంజాయ్ అంటే మందు, విందు పార్టీలు అనుకుని రాత్రుళ్లు మద్యం సేవించి రోడ్లపైకి ద్విచక్రవాహనాలతో ర్యాష్ డ్రైవింగ్, స్పోర్ట్స్ బైక్‌లపై మితిమీరిన వేగంతో పోటీ పడుతూ పందేలు కాస్తారు. ఇలాంటి వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేసే వారి వాహనాలను స్వాధీనం చేసుకుంటాం.

న్యూస్‌రీల్

బంగారు పతకం సాధించిన జట్టుకు స్వాగతం



స్వాగతం పలుకుతున్న సభ్యులు

మంచిర్యాలటౌన్: హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 27నుంచి 29వరకు జరిగిన సీఎం కప్ హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలికల జట్టు ఘన విజయం సాధించింది. బంగారు పతకంతో సోమవారం మంచిర్యాలకు వచ్చిన జట్టుకు అసోసియేషన్ సభ్యులు ఘన స్వాగతం పలికారు. మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు, ట్రెజరర్ అల్లువెల్లి రమేశ్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథరెడ్డి, డీవైఎస్‌వో కీర్తి రాజ్‌వీర్, కారంగుల రామయ్య, ఎస్జీఎఫ్ సెక్రెటరీ ఫణిరాజ, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్, పీడీ రేణి రాజయ్య, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఐదు రోజులు పత్తి కొనుగోళ్లు బంద్

చెన్నూర్: చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో తాత్కాలికంగా పత్తి కొనుగోళ్లను బంద్ చేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. జిన్నింగ్ మిల్లుల్లో పత్తి నిల్వలు పేరుకుపోయాయని, సీపీవో నాయక్ ఆదేశాల మేరకు జనవరి 1 నుంచి 3వరకు పత్తి కొనుగోళ్లు నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. 4, 5వ తేదీల్లో సాధారణ సెలవు రోజులు కావడంతో పత్తి కొనుగోళ్లు బంద్ ఉంటుందని తెలిపారు. చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాల రైతులు గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.

ఎస్ఎస్ఏల వినూత్న నిరసన



నిరసనలో ఎస్ఎస్ఏలు

మంచిర్యాలఅగ్రికల్చర్: విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె సోమవారం 21వ రోజుకు చేరింది. మహిళా ఉద్యోగులు బుర్రకథ వేషధారణతో సమస్యలను కథగా చెబుతూ నిరసన వ్యక్తం చేశారు. జేఏసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుమలత, రాజన్న మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలని సమ్మె చేస్తున్నా స్పందించడం లేదని పేర్కొన్నారు.

రూ.5కోట్లు జరిమానా !

- ఈ ఏడాదిలో 21వేలకు పైగా ట్రాఫిక్ ఉల్లంఘనలు
- సైబర్ నేరగాళ్లతో పోగొట్టుకుంది రూ.2.30కోట్లు
- పెరిగిన హత్యలు, దొంగతనాలు, తగ్గిన మోసాలు
- జిల్లా వార్షిక నేర నివేదిక వెల్లడించిన రామగుండం సీపీ శ్రీనివాస్



నివేదిక విడుదల చేస్తున్న సీపీ శ్రీనివాస్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఈ ఏడాది జిల్లాలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 21వేలకు పైగా వాహనదారులకు రూ.5కోట్లు జరిమానా విధించారు. మందుబాబులు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జరిమానా చెల్లించారు. ఇక పోలీసులకు ఎప్పటికప్పుడు సవాల్ విసురుతున్న సైబర్ నేరాలతోనూ ఈ ఏడాది సైబర్‌క్రైం కేసులు 134 నమోదు కాగా.. బాధితులు రూ.2.71కోట్లు పోగొట్టుకున్నారు. 2024 రామగుండం కమిషనరేట్ పరిధిలో జరిగిన నేరాలపై సోమవారం సీపీ శ్రీనివాస్ నివేదిక విడుదల చేశారు. ఆ వివరాల ప్రకారం.. కమిషనరేట్ పరిధిలో 5,048 సెల్‌ఫోన్లు పోగొట్టుకోగా.. సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా ఇప్పటివరకు 1468 ఫోన్లు తిరిగి ఇప్పించారు. సీసీఎస్‌లో 12 ఆస్తి కేసులు పరిష్కరించారు. డీఎస్ఏ వేలిముద్రల సాంకేతికతను వినియోగించి 56ఆస్తి కేసులు ఛేదించారు. టాస్క్‌ఫోర్స్ టీంతో 201 దాడుల్లో 186కేసులు నమోదు చేసి 626మందిని అరెస్టు చేశారు. ఇక వరకట్న కేసుల్లో ఏడుగురు చనిపోగా.. 61పోక్సో, 214 హింస కేసులు, 83 అట్రాసిటీ కేసులు, 70,627 పెట్టి కేసులు నమోదు చేశారు. ఇక 141మందిపై రౌడీ షీట్స్, 442మందిపై నాన్‌బెయిలబుల్ వారెంటు జారీ అయ్యాయి. ఇక లోక్ అదాలత్‌లో 23,083 కేసులు పరిష్కరించారు. 58కేసుల్లో 20.54 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని 143మందిపై కేసులు నమోదు చేశారు. 412 రోడ్డు ప్రమాదాల్లో 132మంది చనిపోయారు.

ప్రజలతో మమేకం

పల్లె నిద్ర, వైద్య శిబిరాలు, అసంఘటిత కార్మిక పిల్లలకు వర్క్ సైట్ స్కూల్, ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ తదితర సామాజిక కార్యక్రమాలతో పోలీసులు ప్రజలతో మమేకం అవుతున్నారు. వీటితోపాటు ఆపరేషన్ గరుడ, గంజాయి నియంత్రణ, షీ టీం అవగాహన సదస్సులు, విపత్తు నివారణ చర్యలు, మత్తు పదార్థాల వ్యసనం తగ్గించడం, మావోయిస్టు కార్యకలాపాలపై దృష్టి, సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణ, సీసీ కెమెరాల ఏర్పాట్లు, బందోబస్తులు, తనిఖీలు విస్తృతం చేశారు.

ఈ ఏడాది జిల్లాలో ముఖ్య నేరాల నమోదు

నేరం	2023	2024
హత్యలు	24	22
కిడ్నాప్‌లు	45	55
రేప్‌లు	27	41
మోసాలు	372	371
నమ్మక ద్రోహం	7	10
దోపిడీలు	3	7
సాధారణ దొంగతనాలు	161	228
పట్టపగలు ఇళ్లలో చోరీలు	24	19
రాత్రి వేళ ఇళ్లలో చోరీలు	96	101
హత్యాయత్నాలు	45	40
మిస్సింగ్‌లు	318	273
అగ్నిప్రమాదాలు	9	10
కోల్పోయిన సొత్తు	రూ.2,32,54,657	రూ.2,76,10,514
స్వాధీనం చేసుకుంది	రూ.5,41,4310	రూ.13,34,5927
రికవరీ శాతం	23శాతం	48శాతం

శిక్షల విధింపు తీరు

కేసులు	శిక్షాకాలం	జరిమానా(రూ.)	నిందితులు
14	ఏడాదిలోపు	7700	22
9	ఏడాది	287950	12
2	రెండేళ్లలోపు	300	3
6	రెండేళ్లు	6050	8
3	మూడేళ్లు	11700	3
1	నాలుగేళ్లు	100	1
3	ఐదేళ్లు	3000	3
15	---	192500	37

మా టీచర్లు మాకే కావాలి..!

- కేజీబీవీలో ప్రభుత్వ టీచర్లకు నిరసన సెగ
- తామే చదువుకుంటామంటూ తెగేసి చెప్పిన విద్యార్థులు
- 21వ రోజుకు 'సమగ్ర' ఉద్యోగుల సమ్మె



నస్పూర్‌లో ఎంఈవో దామోదర్‌రావు బోధన

మంచిర్యాలఅర్బన్: కేజీబీవీల్లో బోధనకు వెళ్లిన ప్రభుత్వ టీచర్లకు విద్యార్థుల నుంచి నిరసన ఎదురైంది. టీచరు ఎదుటే మీరు వద్దు అంటూ తెగేసి చెప్పారు. సోమవారం నస్పూర్, మందమర్రిలో మినహా మిగతా చోట్ల విద్యార్థులు వ్యతిరేకించినట్లు తెలుస్తోంది. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయా (కేజీబీవీ)ల్లో ఉద్యోగులు సమ్మె చేస్తుండడంతో విద్యార్థులు నష్టపోకుండా విద్యాశాఖ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. జిల్లాలో సమగ్ర శిక్షా ఉద్యోగులు ఈ నెల 6నుంచి సమ్మె చేస్తున్నారు. వారిలో అత్యధికులు కేజీబీవీల్లో పనిచేసే ఎస్‌వోలు, సీఆర్టీలు, పీజీసీఆర్‌టీలు, బోధనేతర సిబ్బంది ఉన్నారు. ప్రతీ రోజు సమ్మెలో ఉంటూనే ఒకరిద్దరు చొప్పున విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా భోజన ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. పాఠ్యాంశాలు బోధించే వారు లేక విద్యార్థులు సొంతంగా చదువుకుంటున్నారు. ఇంటర్, పది పరీక్షలు సమీపిస్తుండడం.. బోధన నిలిచిపోవడంతో ప్రభుత్వ టీచర్లతో బోధనకు విద్యాశాఖ నిర్ణయించింది.

విద్యార్థులు నష్టపోకుండా..

పది, ఇంటర్ షెడ్యూల్ విడుదలైంది. ఇంటర్ విద్యార్థులకు ఫిబ్రవరి 3నుంచి ప్రయోగ పరీక్షలు, మార్చి 5నుంచి వార్షిక పరీక్షలు జరుగనున్నాయి. ఇంకోవైపు సమగ్ర శిక్షా ఉద్యోగులు 21 రోజులుగా సమ్మెతో పాఠ్యాంశ బోధన నిలిచిపోయింది. ఇప్పటికే సిలబస్ పూర్తి చేసి రివిజన్ చేయాల్సి ఉంది. దీంతో సీనియర్ ఉపాధ్యాయినులను కేజీబీవీల్లో తాత్కాలిక ప్రత్యేక అధికారులుగా నియమించేందుకు ఎంపిక చేశారు. సిలబస్ పూర్తికి రోజుకు గంట చొప్పున ప్రభుత్వ పాఠశాలల సబ్జెక్టు టీచర్లకు విధులు కేటాయించారు. కేజీబీవీల్లో అంతా సాఫీగా సాగుతుండడంతో ఎంపిక చేసిన తాత్కాలిక ఎస్వోలు విధులు అప్పగించలేదు. సోమవారం నుంచి ఆయా సబ్జెక్టు టీచర్లు గంటపాటు కేజీబీవీల్లో బోధించాలని విద్యాశాఖాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. జిల్లాలో పలు కేజీబీవీల్లో ఎంఈవోలతో కలిసి ప్రభుత్వ టీచర్లు వెళ్లగానే టీచరు మాకొద్దంటూ విద్యార్థులు నినదించారు. తామే రివిజన్ చేసుకుంటామని చెప్పడంతో వెనుదిరిగినట్లు ఓ అధికారి 'సాక్షి'కి తెలిపారు. సమ్మె ఎటూ తేలకపోవడం.. పరీక్షలు సమీపిస్తుండడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- ప్రజావాణిలో అర్జీల స్వీకరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణి కార్యక్రమంలో సమస్యలపై అందిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారుల సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ మోతీలాల్, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. చెన్నూర్‌లోని రాధాకృష్ణ గీతా అధ్యయన మండలి దేవాలయానికి దూప దీప నైవేద్యాలు మంజూరు చేయాలని పట్టణానికి చెందిన మహాంకాళి అశోక్ కోరారు. మంచిర్యాల 19వ వార్డులో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని మధుసూదన్‌రావు వినతిపత్రం అందజేశారు.

- జన్నారం మండలం పొనకల్ గ్రామానికి చెందిన కాల్వ సుగుణ దివ్యాంగురాలినైన తనకు ప్రభుత్వం ఇచ్చిన భూమిలో ఇల్లు కట్టుకుని నివసిస్తున్నానని, కొందరు అకారణంగా తనపై దాడి చేసి కొట్టారని, న్యాయం చేయాలని కోరింది.
- ఎస్ఆర్‌పీ–2, 2ఏ ఓపెన్‌కాస్టు ఏర్పాటులో తమ భూమి ముంపునకు గురైందని, నష్టపరిహారం ఇప్పించాలని నస్పూర్ మండలం సింగపూర్ గ్రామానికి చెందిన గోలేటి సుమన్, గోలేటి మధు కోరారు.
- మందమర్రి మండల కేంద్రంలోని ఏజెన్సీ ప్రాంత భూమిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదివాసీ నాయక్‌పోడ్ సేవా సంఘం ప్రతినిధి ఎస్.రాజేష్ అర్జీ సమర్పించారు.


రేషన్ కార్డులు ఇవ్వాలి..



పదేళ్లుగా నస్పూర్ మండలం శ్రీరాంపూర్‌లో కూలీ పని చేస్తూ జీవిస్తున్నాం. రేషన్‌కార్డు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా మిగిలిపోతున్నాం. అద్దె ఇంట్లో ఉంటున్నాం. రేషన్‌కార్డు లేక కరెంటు బిల్లు మాఫీ కావడం లేదు. కొత్త రేషన్‌కార్డు ఇవ్వాలి.

– డి.సరిత, శ్రీరాంపూర్, నస్పూర్

రోడ్డు కబ్జాపై చర్యలు తీసుకోవాలి



మంచిర్యాల పట్టణంలోని తిలక్‌నగర్ కాలనీవాసులు తమ వాడలో రోడ్డును ఆక్రమించి గోడ నిర్మించారు. రాకపోకలకు, అంబులెన్స్, ఫైరింజన్ తదితర వాహనాలు రావడానికి దారి లేదు. రోడ్డు ఆక్రమించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి.

– తిలక్‌నగర్ కాలనీ వార్డు నంబర్–3 వాసులు, మంచిర్యాల

భూమి లాగేసుకుంటున్నారు..



ఎలాంటి పబ్లిక్ నోటిఫికేషన్ లేకుండా ఐటీ పార్కు కోసం బెదిరించి సంతకాలు తీసుకుని మా భూములు లాగేసుకుంటున్నారు. మేము పంటలు సాగు చేసుకొని జీవిస్తున్నాం. దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలి.

– వేంపల్లి గ్రామస్తులు, హాజీపూర్

సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: సివిల్ సప్లయి హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో జనవరి 1 నుంచి నిరవధిక సమ్మె చేపడుతామని ఏఐటీయూసీ అనుబంధ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం హమాలీ కార్మికులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన హమాలీ ధరలు 12 నెలలుగా చెల్లించడం లేదని తెలిపారు. సివిల్ సప్లయి కార్పొరేషన్ కమిషనర్‌కు అనేక సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పొనుగంటి సత్యనారాయణ, సంపత్, చంద్రయ్య, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యోగా పోటీల్లో ప్రతిభ



బహుమతి అందుకుంటున్న రాజకొమురయ్య

రామకృష్ణాపూర్: ఇండియన్ యోగా స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం బెల్లంపల్లిలో నిర్వహించిన జాతీయ స్థాయి యోగా చాంపియన్ షిప్ పోటీల్లో రామకృష్ణాపూర్‌కు చెందిన రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి ఎమ్.రాజకొము రయ్య ప్రతిభ కనబర్చాడు. 60 నుంచి 70 ఏళ్ల విభాగంలో ప్రథమ బహుమతి సాధించాడు. స్థానిక క్రీడాకారులు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

మంచిర్యాలఅర్బన్: హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ అండర్–19 సెక్రెటరీ బాబురావు తెలిపారు. ట్రిపుల్ జంప్‌లో బి.విష్ణు (ఎంజేపీ, లక్సెట్టిపేట), 1500 మీటర్ల పరుగుపందెంలో ప్రకాశ్ (ఎంజేపీ, చెన్నూర్), ఆరు కిలోమీటర్ల క్రాస్ కంట్రీలో జే.దీపక్ (ఎంజేపీ, గుడిపేట్) ప్రతిభ కనబర్చినట్లు ఆయన పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


ఇందన్‌పల్లి రేంజ్‌లో పట్టుకున్న ట్రాక్టర్

జన్నారం: జన్నారం అటవీ రేంజ్ పరిధిలోని మందపెల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంచిర్యాల టాస్క్‌ఫోర్స్, ఇందన్‌పల్లి రేంజ్ సిబ్బంది సోమవారం పట్టుకున్నట్లు రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహిస్తుండగా ఇసుకతో వస్తున్న ట్రాక్టర్ కనిపించడంతో సీజ్ చేసి రేంజ్ కార్యాలయానికి తరలించామన్నారు. ఈ దాడిలో సిబ్బంది సునీల్, రవి, ముజీబొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తోంది సోన్ మండలంలోని న్యూవెల్మల్ గ్రామానికి చెందిన కొండ రవి అనే రైతు సాగుచేసిన ఆయిల్ పాం తోట. అందులో అంతర పంటను పరిశీలిస్తున్న అధికారులు సోన్ మండల వ్యవసాయ శాఖకు చెందిన ఏఈవోలు. రైతులు మొక్కజొన్న, సోయా, వేరుశనగ, శనగ, పెసర, బొబ్బర్లు వంటి పంటలు సాగు చేయడం సహజం. కానీ ఈ రైతు మాత్రం అందరికీ భిన్నంగా ఆయిల్‌పాం పంటలో అంతరపంటగా వానాకాలంలో వరి సాగుచేసి అధిక దిగుబడి సాధించాడు. దీంతో యాసంగిలో కూడా వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేశాడు.


చామన్‌పెల్లి వద్ద ఆయిల్‌పాం తోటలో సాగవుతున్న మొక్కజొన్న

మిశ్రమ సాగు.. లాభాలు బాగు

- ఆయిల్‌పాం తోటలో అంతర పంటలు సాగు
- లాభాలు గడిస్తున్న రైతులు
- నిర్మల్ జిల్లాలో 8,500 ఎకరాల్లో సాగు

లక్ష్మణచాంద(నిర్మల్): అన్నదాతలు పురాతన పద్ధతిలో పంటలు సాగు చేసి నష్టాలబాట పడుతున్న నేటి తరుణంలో నిర్మల్ జిల్లాలోని వివిధ మండలాల రైతులు అందరికీ భిన్నంగా మిశ్రమ పంటలు సాగు చేస్తున్నారు. అధిక దిగుబడులు సాధిస్తూ లాభాలబాట పడుతున్నారు. సదరు రైతులు సాగులో సాధిస్తున్న సక్సెస్‌పై 'సాక్షి' అందిస్తున్న కథనం.

8,500 ఎకరాల్లో సాగు

నిర్మల్ జిల్లాలోని 19 మండలాల పరిధిలో 8500 ఎకరాల్లో పామాయిల్ సాగవుతున్నట్లు వ్యవసాయశాఖ అధికారుల అంచనా. సాధారణంగా ఆయిల్‌పాం సాగులో ఐదేళ్ల వరకు పంట దిగుబడి ప్రారంభం కాదు. దీంతో వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు వివిధ మండలాల్లోని పలువురు యువరైతులు ఆయిల్‌పాంలో అంతర పంటగా వివిధ రకాల పంటలు పండిస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు.

☞ సోన్ మండలంలోని చింతల్‌చాంద గ్రామానికి చెందిన యువరైతు నాగభూషణ్ మిశ్రమ వ్యవసాయం సాగు చేస్తున్నారు. ఆయిల్‌పాం తోటలో తైవాన్ జామతో పాటు, మొక్కజొన్న వేరుశనగ పంటలు సాగు చేస్తున్నారు.

ప్రత్యామ్నాయం పంట పండింది

వేమనపల్లి(బెల్లంపల్లి): ప్రాణహిత వరద ముంపుతో నిండా మునిగిన రైతులు అధైర్య పడకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసి కొంత ఉపశమనం పొందుతున్నారు. ఈ ఏడాది జులై, ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు ప్రాణహిత నది రెండుసార్లు ఉప్పొంగి ప్రవహించింది. దీంతో లోతట్టు ప్రాంతాలైన వేమనపల్లి, సుంపుటం, జాజులపేట, ముక్కిడిగూడెం, కళ్లంపల్లి, కేతన్‌పల్లి, కల్మలపేట, ముల్కలపేట, రాచర్ల గ్రామ శివారులోని సుమారు 2,500 ఎకరాల్లో పత్తి పంటలు నీట మునిగాయి. కోటపల్లి,


ఆశాజనకంగా ఉన్న పత్తి చేను

చెన్నూర్ మండలాల్లో సైతం రైతులు భారీగా నష్టపోయారు. వరుసగా రెండుసార్లు వరద ముంచెత్తడంతో ముంపు భూముల్లో వేరే పంట సాగు చేయలేక భూములు బీళ్లుగా ఉండిపోయాయి. దీంతో కౌలు, పెట్టుబడి ఖర్చులు భారం కాగా వర్షాలు తగ్గుముఖం పట్టాక ఏదో ఒక పంట సాగు చేయాలని అనుకున్నారు.

50 ఎకరాల్లో పత్తి

మండలంలో ప్రాణహిత లోతట్టు ప్రాంతాల్లోని నీటి వసతి ఉన్న ఎనిమిది మంది రైతులు సుమారు 50 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. మిగతా భూముల్లోని రైతులు జొన్న, పెసర, నువ్వులు లాంటి ఆరుతడి పంటలు సాగు చేశారు. వర్షాకాలం పంట మునిగి నష్టం చవిచూసిన ముంపు రైతులు ఆలస్యంగానైనా పంట సాగు చేయాలనుకున్నారు. వరదలు తగ్గుముఖం పట్టిన తర్వాత ఆలస్యంగా అక్టోబర్‌లో పత్తి, ఇతర పంటలు సాగు చేశారు.

అధిక లాభాలు



నాకున్న రెండెకరాల్లో ఆయిల్‌పాం సాగు చేశా. అందులో అంతర పంటగా తైవాన్ జామతో పాటు పెసరి పంటలు సాగు చేస్తున్నా. అంతర పంటలతో అధిక లాభాలు ఉన్నాయి.

– పెంటన్న, రైతు, రావాపూర్

మంచి దిగుబడి వచ్చింది



నాకున్న మూడున్నర ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేశా. అందులో అంతర పంటలుగా వానాకాలం నువ్వు, మొక్కజొన్న వేశా. మంచి దిగుబడి రావడంతో యాసంగిలో వేరుశనగ సాగు చేశా.

– కేశం శ్రీనివాస్, రైతు, మల్లాపూర్

అంతర పంటలతో ఆదాయం



ఆయిల్‌పాంలో అంతర పంటలు సాగుచేస్తే మంచి ఆదాయం వస్తుంది. జిల్లాలోని పలువురు రైతులు అంతర పంటలు సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. మిగతా రైతులు కూడా ఆయిల్‌పాం సాగుకు ముందుకు రావాలి.

– వసంత్‌రావు, ఏవో, లక్ష్మణచాంద

☞ సోన్ మండలంలోని పాక్‌పట్ల గ్రామానికి చెందిన ఎల్చల్ గంగారెడ్డి అనే యువరైతు 14 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేశాడు. అందులో అంతర పంటలుగా పసుపు, మొక్కజొన్న, కంది పంటలు సాగుచేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నాడు.

☞ లక్ష్మణచాంద మండలంలోని చామన్‌పెల్లి గ్రామానికి చెందిన రైతు ఏలేటి శ్రీనివాస్‌రెడ్డి తన కున్న రెండున్నర ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేశాడు. అందులో అంతర పంటలుగా తైవాన్ జామ, వాటర్ ఆపిల్, బొప్పాయి, ఆకుకూరలు, కూరగాయలు సాగు చేస్తున్నా డు.

దుబాయ్ వెళ్లాలని... ముంబైలో దారితప్పి..

- ఉపాధి కోసం వెళ్లిన జిల్లావాసి అదృశ్యం

నిర్మల్‌ఖిల్లా: అనునిత్యం గల్ఫ్‌దేశాల్లో వివిధ కారణాలతో జిల్లావాసుల మరణ మృదంగం కొనసాగుతున్నా.. ఉపాధి వలసలు మాత్రం ఆగడం లేదు. ఇదే కోవలో జిల్లాకు చెందిన ఒకరు నాలుగు నెలల క్రితం గల్ఫ్ దేశమైన దుబాయ్ వెళ్లాలని ముంబై చేరుకుని అక్కడ దారితప్పగా ఇప్పటికీ ఆచూకీ లభ్యం కానీ ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం బీరవెల్లికి చెందిన తంబాకు శ్రీనివాస్ (39) కుటుంబ పోషణ కోసం ఉన్న ఊరిలో అప్పుల పాలు కావడంతో ఉపాధికోసం దుబాయ్ వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. గల్ఫ్ ఏజెంటును ఆశ్రయించాడు. ఉద్యోగం ఇప్పిస్తానని సదరు ఏజెంటు రూ.75వేలు తీసుకొని ముంబైలోని ట్రావెల్ ఏజెన్సీ సర్వీసెస్ సహాయంతో ఆగస్టు 5న విమాన టికెట్ బుక్ చేశాడు. ఆగస్టు 3న ఆర్మూర్ నుంచి ముంబైకి బస్సులో బయలుదేరిన శ్రీనివాస్ 4న అక్కడికి చేరుకున్నట్లు భార్య లక్ష్మికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. ఇప్పటి వరకు అతను ఎక్కడికి వెళ్లిందీ.. ఏం చేస్తున్నాడన్న సమాచారం లేదు. ఫోన్ సైతం స్విచ్ ఆఫ్ వస్తుండడంతో సదరు ఏజెన్సీ ఏజెంట్‌ను పదేపదే అడుగగా బోర్డింగ్ అయిన తర్వాత ఫ్లైట్ ఎక్కకుండా ఉంటే తాము చేయగలిగిందేమీలేదని స్పష్టం చేయడంతో కుటుంబ సభ్యులు అవాక్కయ్యారు. సారంగాపూర్ పోలీస్ స్టేషన్లో కూడా సంప్రదించినట్లు పేర్కొన్నారు. తాజాగా సోమవారం శ్రీనివాస్ భార్య లక్ష్మి నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పర్కిపండ్ల, కలెక్టర్, జిల్లా పోలీస్ అధికారి కార్యాలయాల్లో ఫిర్యాదు చేస్తూ తన భర్త ఆచూకీ కనుగొనాలని వేడుకున్నారు. గత నాలుగు నెలలుగా తీవ్ర ఆందోళన చెందుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

పసికందు మృతిపై ఆందోళన

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది డిశ్చార్జి అయిన రెండు రోజులకు శిశువు మృతి చెందడంతో సోమవారం బాధిత కుటుంబ సభ్యులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. పాతబెల్లంపల్లికి చెందిన గర్భిణి గందం గంగవ్వ ఈనెల 24న జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. చిన్నారిని సమీపంలోని ఓ ప్రైవేటు పిల్లల ఆస్పత్రిలో చేర్పించి నాలుగు రోజులపాటు చికిత్స అందించారు. ఈ నెల 28న సాయంత్రం డిశ్చార్జి చేశారు. ఆదివారం రాత్రి మృతి చెందింది. వైద్యులు సరైన చికిత్స ఇవ్వకపోవడంతోనే మృతి చెందిందని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. సీఐ ప్రమోద్‌రావు, ఎస్సైలు ప్రవీణ్, వినీత సంఘటనా స్థలానికి చేరుకుని కేసు పెడితే దర్యాప్తు చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. సదరు ఆస్పత్రి వైద్యుడిని వివరణ కోరగా డిశ్చార్జి చేసిన 48 గంటల తరువాత పాప మృతి చెందిందని, తమ వైద్యంలో ఎలాంటి పొరపాటు లేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడు మృతి

చెన్నూర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని గెర్రెకాలనీలో నివాసముంటున్న చింతకింది రమేశ్ (32) శ్రీరాంపూర్‌లోని ఆర్కే–5 గనిలో విధులు నిర్వహిస్తున్నాడు. గని వద్ద మైసమ్మ చేస్తున్నారని, మటన్ తీసుకువస్తానని భార్యతో చెప్పి ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి ఇంటికి తిరిగి వస్తుండగా సుద్దాల క్రాస్‌రోడ్డు వద్ద 63వ జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి కిందపడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం ఉదయం స్థానికుల సమాచారంతో విషయం తెలుసుకున్న పోలీసులు మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని భార్య శ్వేత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొని ఒకరికి గాయాలు

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ 61వ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు దిలావర్‌పూర్ మండలం కదిలి గ్రామానికి చెందిన కరడే నాందేవ్ ద్విచక్ర వాహనంపై మహారాష్ట్రలోని బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా రాంపూర్ వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108లో నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. నాందేవ్ కుమారుడు పాపేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు.

పత్తిలోడుతో వెళ్తున్న ఐచర్ బోల్తా

పెంబి: పత్తిలోడుతో వెళ్తున్న ఐచర్ వాహనం (డీసీఎం) బోల్తా పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. హరిచంద్‌తాండకు చెందిన రాజేశ్వర్ ఐచర్‌లో పత్తి నింపి కడెం వాగులోంచి తీసుకెళ్తుండగా బ్రేకులు ఫెయిల్ కావడంతో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. రైతు వాగులో దూకడంతో ప్రమాదం తప్పింది. కాగా వాహనం నీటి గుంతలో పడటంతో పత్తి సగానికి పైగా తడిసిపోయింది. రెండు జేసీబీల సాయంతో వాహనాన్ని పక్కకు తీసి తడవని పత్తిని వేరే ఐచర్‌లో వేసి తీసుకెళ్లారు.

వంతెన ఉంటే ప్రమాదం జరిగేది కాదు

కడెం వాగుపై పస్పుల వద్ద మూడేళ్ల క్రితం నిర్మించిన వంతెన కడెం వరద ఉధృతికి కొట్టుకుపోయింది. మరమ్మతులు చేపట్టి ఉంటే ఈ ప్రమాదం తప్పేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాండూర్: మండల కేంద్రానికి చెందిన ఇందారపు సురేష్ (39) ఆదివారం రాత్రి రైల్వే సబ్‌స్టేషన్ సమీపంలో కూలి పనికి వెళ్లాడు. విద్యుత్‌షాక్ తగలడంతో తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. మృతుని భార్య ఇందారపు శారద అలియాస్ రోజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీఈవోపై దాడి చేసిన ఎనిమిది మందిపై కేసు

బెల్లంపల్లి: ఆరిజిన్ డెయిరీ సీఈవో కందిమళ్ల ఆదినారాయణపై దాడికి పాల్పడిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎన్.దేవయ్య తెలిపారు. ఆదివారం రాత్రి బెల్లంపల్లి బజారు ఏరియా యూనియన్ బ్యాంకు లైన్‌లో ఉన్న ఓసెలూన్ షాప్‌కు ఆదినారాయణ వెళ్లడంతో రాగంశెట్టి సతీష్, కొత్తపల్లి శ్యామ్‌తో పాటు మరో ఆరుగురు వ్యక్తులు సామూహికంగా దాడి చేశారని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ పేర్కొన్నారు.

చోరీకి పాల్పడుతున్న ముగ్గురిపై ..

లక్ష్మణచాంద: దొంగతనం చేస్తూ ముగ్గురు వ్యక్తులు పట్టుబడిన సంఘటన మండలంలోని చింతల్‌చాంద గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్సై సుమలత తెలిపిన వివరాల ప్రకారం తిర్పెల్లి గ్రామానికి చెందిన సుంచు వినయ్, దేశవోయిన సుకుమార్, శివరాత్రి భూమేష్ జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బులు సంపాదించాలని అనుకున్నారు. సోమవారం ఉదయం చింతల్‌చాందకు చెందిన రైతు నక్కల అన్వేష్ గ్రామ శివారులోని రహదారిపై వరి ధాన్యాన్ని సంచులలో నింపి ఉంచాడు. గమనించిన నిందితులు వాటిని ఎత్తుకునేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో అటుగా వస్తున్న గ్రామస్తులు వారిని చూసి పట్టుకున్నారు. నక్కల అన్వేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పోడు సాగు చేస్తున్న ఒకరి రిమాండ్

చింతలమానెపల్లి: అటవీభూమి సాగు చేస్తున్నాడని మండలంలోని దిందా గ్రామానికి చెందిన ఆత్రం భీంరావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు దిందా సెక్షన్ అధికారి మోహన్ తెలిపారు. ఖర్జెల్లి రేంజ్ పరిధిలోని బందెపల్లి బీట్ 179 కంపార్ట్‌మెంట్‌లో అటవీభూమిని ఆత్రం భీంరావు ఆక్రమించుకున్నాడు. ఈమేరకు కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టినట్లు ఆయన పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

విద్యుత్‌షాక్‌తో ఒకరు మృతి


పెద్ద భీమన్న (ఫైల్)

ఖానాపూర్: విద్యుత్‌షాక్‌తో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన వివరాల మేరకు మస్కాపూర్ గ్రామానికి చెందిన ఒడ్నాల పెద్ద భీమన్న (64)కు గంగాయిపేట్‌లో వ్యవసాయ పంటపొలం ఉంది. అందులో కూరగాయలు సాగు చేశాడు. కోతుల బెడద నుంచి తప్పించుకునేందుకు జియా వైరుకు సోలార్ కనెక్షన్ ఇచ్చాడు. ఎప్పటిలాగే సోమవారం సైతం పంట చేనుకు వెళ్లగా జియా వైర్(ఇనుప తీగ) కు కాలుతగలడంతో షాక్‌కు గురై కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ సైదారావు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు.

జంగుబాయి ఉత్సవాలు విజయవంతం చేయాలి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీల ఆరాధ్య దైవం రాయితాడ్ జంగుబాయి ఉత్సవాలు విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. సోమవారం హైదరాబాద్ ప్రజా భవన్‌లో జంగుబాయి దేవస్థానం నిర్వహణ కమిటీ సభ్యులు, ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 2న కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కోటపరంధోళి గ్రామంలో ఉత్సవాలు జరుగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ శ్యాంరావు, గౌరవ అధ్యక్షుడు జాకు, సలహాదారులు మరప బాజీరావు, భూమేశ్, నాగు, రామారావు కటోడ, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

మండలంలోని పెర్కగూడ, పిట్లగూడ, చీమనాయక్‌తాండ, వడోని, కుమ్మరితాండ, తదితర గ్రామాల్లోని లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఖయ్యూం, మాజీ సర్పంచ్ జగదీశ్, లింగన్న, మల్లుబాయి, భరత్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గాదిగూడ మండలం సిద్ధం గ్రామానికి చెందిన లక్ష్మీబాయి త్రిఫేస్, బోర్‌వెల్ మంజూరు చేయాలని, నార్నూర్ మండలానికి చెందిన కిరణ్ కుమార్ కారులోన్ ఇప్పించాలని, ఉట్నూర్ మండలం మారుతిగూడకు చెందిన రుక్మాబాయి బోరింగ్ రిపేర్ చేయించాలని కోరారు. ఇంకా వివిధ సమస్యలపై ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో ఏపీవో వసంత్‌రావు, ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, ఐసీడీఎస్ ఉమాదేవి, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ప్రైవేటు లాడ్జీల యజమానులపై కేసు

బాసర: బాసరలోని ప్రైవేటు లాడ్జీల యజమానులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన లాడ్జి ఓనర్‌తో పాటు లీజుకు తీసుకున్న మరో లాడ్జి ఓనర్‌పై పోక్సో చట్టం కింద ఒకటి హైదరాబాద్‌లో, బాసరలో మరొకటి వేర్వేరుగా కేసులు నమోదైనట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆలయం వద్ద ఉన్న ప్రైవేటు లాడ్జీలను తనిఖీ చేశారు. రిజిస్టర్లు, అద్దె గదులను పరిశీలించి గుర్తు తెలియని వ్యక్తులకు అద్దెకు ఇవ్వవద్దని లాడ్జి యజమానులకు సూచించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే లాడ్జి యజమానులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ మల్లేశ్, ఎస్సై గణేశ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాష్ కుమార్

ఉరేసుకుని యువకుడు..


సాయిచరణ్ (ఫైల్)

నేరడిగొండ: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని బుద్దికొండకు చెందిన సింగం లక్ష్మణ్ కుమారుడు సాయిచరణ్ (23) ఈనెల 25న తన స్నేహితుడి పుట్టినరోజు సంబరాలను ఊరుబయట ఉన్న పోచమ్మ ఆలయం వద్ద జరుపుకోగా అక్కడ ఉన్న హైమాస్ లైట్లను యువకులు పగులగొట్టారు. దీంతో గ్రామ పెద్దలతో పాటు గ్రామఅభివృద్ధి కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌సై శ్రీకాంత్ సదరు యువకులను పిలిపించి ప్రశ్నించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండాలని సూచించారు. కాగా ఆదివారం రాత్రి సాయిచరణ్ బయటకు వెళ్లివస్తానని చెప్పి గ్రామ శివారులో గల పంట పొలంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన కుమారుడి మృతికి గ్రామస్తులే కారణమని, పోలీసు స్టేషన్‌కు పిలిపించడంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు, బంధువులు రహదారిపై బైటాయించారు. మృతికి కారణమైన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, ఇచ్చోడ సీఐ భీమేశ్ సంఘటన స్థలానికి చేరుకుని బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

నిమోనియాతో చిన్నారి..

ఇంద్రవెల్లి: నిమోనియాతో చిన్నారి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని హర్కపూర్ ఆంధ్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని కైలాస్‌నగర్‌కు చెందిన కుడే సంతోశ్, పూజ దంపతుల కుమార్తె సీతాల్ (రెండు నెలలు) వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు మూడురోజుల క్రితం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో వైద్యపరీక్షలు నిర్వహించగా చిన్నారి నిమోనియాతో బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించారు. వెంటిలేటర్‌లో ఉంచి చికిత్స అందించినా పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.